# కంచిలో శ్రీ ఏకామ్రేశ్వరుని గురించి తెలుసుకుందాం:-

**సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్**

Regd. 192/2019



# కంచిలో శ్రీ ఏకామ్రేశ్వరుని గురించి తెలుసుకుందాం:-

ఈ సమస్త సృష్టి  ఎనిమిది పదార్ధములతో నిండి ఉన్నదని మన పురాణ వచనం. అవి భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, జీవుడు, చంద్రుడు మరియు సూర్యుడు. సర్వ వ్యాపకుడైన పరమశివుడే ఈ ఎనిమిది రూపాలను ధరించి యున్నాడు. అందుకనే శివార్చన లో "అష్టమూర్తి తత్వార్చన" విశేషముగా చెప్పబడినది.

1. ఓం శర్వాయ క్షితి మూర్తయే నమః (భూమి)
2. ఓం భవాయ జల మూర్తయే నమః (జలము)
3. ఓం రుద్రాయ అగ్ని మూర్తయే నమః (అగ్ని)
4. ఓం ఉగ్రాయ వాయు మూర్తయే నమః (వాయువు)
5. ఓం భీమయ ఆకాశ మూర్తయే నమః (ఆకాశము)
6. ఓం పశుపతయే యాజమాన మూర్తయే నమః (జీవుడు)
7. ఓం మహాదేవాయ సోమ మూర్తయే నమః (చంద్రుడు)
8. ఓం ఈశానాయ సూర్య మూర్తయే నమః (సూర్యుడు)

అందుకనే జగద్గురులైన శ్రీ ఆదిశంకరాచార్యుల వారు కూడా "శ్రీ దక్షిణామూర్తి స్తోత్రం" లో ఈ ఎనిమిది పదార్థాలు శివుడే అయి ఉన్నాడని వర్ణించారు.

"....... ఇత్యాభాతి చరాచారాత్మక మిదం యస్యైవ మూర్త్యష్టకం........"

దీనికి ప్రతీకగా ఆ సదాశివుడు ఎనిమిది క్షేత్రములలో ఎనిమిది లింగ స్వరూపములు గా వెలసి యున్నాడు. అవి

1. పృథ్వీ లింగము - కాంచిపురము

2. జల లింగము - జంబుకేశ్వరము

3. అగ్ని లింగము - అరుణాచలము

4. వాయు లింగము - శ్రీకాళహస్తి

5. ఆకాశ లింగము - చిదంబరము

6. యాజమాన లింగము - ఖాట్మండు

7. చంద్ర లింగము - సీతాకుండము (ప్రస్తుతం బంగ్లాదేశ్ లో ఉంది)

8. సూర్య లింగము - కోణార్క్

కాంచీనగరము నందు శంకరుడు "శ్రీ ఏకామ్రేశ్వరుడు" అను పేర పృథ్వీ లింగమై వెలసి యున్నారు.

ఇక్కడ ఈ స్వామి నిలిచి ఉండుటకు కారణమైన సంఘటనలను పరిశీలిద్దాం.

కైలాసం నందు ఒకనాడు పరమశివుడు ధ్యాన మగ్నుడై యుండగా ఉమాదేవి లీలవినోదమునకై ఆయన కన్నులను వెనుక నుంచి మూసేను.

"వందే సూర్యశశాంకవహ్ని నయనం" అని కదా. సూర్యచంద్రులు ఆ స్వామికి రెండు కన్నులై ఉంటారు. ఉమాదేవి కన్నులు మూయటం చేత సూర్యచంద్రులు కనిపించక లోకము నందు చీకటి పడి ధర్మము నిలిచిపోయింది. జరిగినది

గ్రహించిన శంకరుడు తన మూడవ కన్ను తెరచి అగ్నిని ప్రశరింప చేసి లోకములకు వెలుగు నిచ్చెను. కాని అప్పటికే కొన్ని యుగముల బాటు అంతా చీకటిమయమాయెను. జరిగినది గ్రహించిన ఉమాదేవి మిక్కిలి దుఃఖించి, చేసిన పాపము పరిహారమగు మార్గము తెలుపమని శంకరుని కోరగా, శంకరుడు ఆ తల్లిని భూలోకము చేరి తపస్సు చేయమని తెలిపెను.

ఉమాదేవి భూలోకము చేరి, సంతానార్థియై తపించుచున్న కాత్యాయన మహర్షి యొక్క ఆశ్రమమున చిన్న శిశువు రూపమున వెలసింది. తన కోర్కెను తీర్చుటకు జగన్మాతయే వచ్చెనని పొంగిపోయిన ఆ మహర్షి ఆ శిశువునకు "కాత్యాయని" అని నామకరణము చేసిరి. అలా ఆ మహర్షి వద్ద పెరిగి సమస్త విద్యలను ఆ తల్లి అభ్యసించి, యుక్తవయసు వచ్చిన తర్వాత మహర్షి ఆ తల్లిని పిలిచి ఆ పరమేశ్వరుని భర్త గా బొందుటకు తపము చేయమని చెప్పి, తపస్సుకు కావలసిన సంబారములను ఇచ్చి పంపెను.

అలా బయలుదేరిన ఆ కాత్యాయని దేవి కాంచీ క్షేత్రము చేరింది. అక్కడ అడుగిడిన వెంటనే కాత్యాయన మహర్షి ఇచ్చిన సంబారములు రూపాంతరము చెందెను. అప్పుడు ఆ తల్లి తపస్సునకు అదే సరియైన క్షేత్రమని నిర్ధారించి, తన శక్తులైన దుర్గ, కాళి మున్నగు వారిని కాపలాకై ఉంచి, నాలుగు వేదములే నాలుగు శాఖలుగా వెలుగొందుచున్న ఒక మామిడి చెట్టు నీడన సైకతముతో ఒక శివ లింగమును తయారుచేసి, పూజించి, పంచాగ్ని తపస్సును ఆరంభించింది.

ఉమాదేవి తపస్సును పరిశీలించదలచిన పరమశివుడు లోక పావని అయిన గంగమ్మను పంపిరి. గంగమ్మ ప్రళయ భీకర ప్రవాహముతో కాంచీనగరముపై దుమికెను. అంతట కాత్యాయనీ దేవి ఆజ్ఞతో కాళీ శక్తి తన చేతియందు యున్న "విశ్వభక్షణము" అను కాపాలమును ఆ ప్రవాహమునకు ఎదురుగా చూపెను. ఆ కపాల ప్రభావము వలన గంగమ్మ, శివుడు కూడా ఆ కపాలము నందు వచ్చి చేరెను. శివుడు మరింతగా ప్రవాహమును పెంచెను. ఆ ప్రవాహమునకు కపాలము బ్రద్దలై మరల గంగమ్మ కాత్యాయని తల్లి యొక్క తపో ప్రదేశము వైపునకు ఉగ్రరూపముతో ప్రవహించెను. ఆ ప్రవాహము చూసి బెదరిన ఆ తల్లి "కంపా", "కంపా" అని అరచి తన అన్నగారైన శ్రీమన్నారాయణుని శరణు వేడెను. ఆ శ్రీహరి ప్రత్యక్షమై తన సోదరితో ఇదంతా సదాశివుని పరీక్ష అని తెలిపి తన భక్తిని, ప్రేమను ప్రకటించమని ఉపాయము తెలిపెను. అన్నగారి ఉపాయము విని సంతసించిన ఆ తల్లి, తాను పూజించిన సైకత లింగమును గట్టిగా ఆలింగనం చేసుకుంది.

"ఉమాలింగన సంక్రాంతం కుచకంకణ ముద్రితం
లింగామేక్రామ్రనాధంచ సైకతం తముపాస్మహే "

అమ్మవారి ఆలింగనము వలన ఆ తల్లి యొక్క కుచముల, కంకణముల ముద్రలు ఆ లింగము పైన పడ్డాయి. ఆ ముద్రలు నేటికి స్పష్టముగా దర్శనం చేయగలగడం విశేషం. అమ్మవారి ఆలింగనమునకు ప్రసన్నుడైన శంకరుడు ప్రత్యక్షమై, ఆ తల్లి తన కన్నులు మూయడము వలన కలిగిని దోషము పరిహారమాయెనని పలికెను. అంతట దేవతలందరూ వచ్చి శివపార్వతుల

కళ్యాణము మరల జరుగవలెనని కోరగా ఆ శంకరుడు దానికి ఇంకా సమయమున్నదని పలికి, ఈ సమస్త "జగన్నాటకము" యొక్క తదుపరి ఘట్టము జరుగుటకు జగన్మాతను అరుణాచల క్షేత్రమునకు పంపెను. అమ్మవారు "కంపా" అని పలికిన కారణము చేత అక్కడ ప్రవహించిన గంగమ్మకు "కంపానది" అని పిలిచారు. కాలక్రమమున ఈ కంపానది అంతర్వాహిని అయింది. గొప్ప పరీక్షను సైతం తట్టుకొని భర్తకై తపస్సు చేసి, ఆయనను ప్రసన్నము చేసుకొన్న ఈ తల్లి ఆశీస్సులు కొరకు మరియు శీఘ్ర వివాహము కొరకు కన్యలు "కాత్యాయని వ్రతము"ను ఆచరించడం మన సాంప్రదాయంలోకి వచ్చింది.

జగన్మాత నిలిపి, కొలచిన సైకత లింగమే "శ్రీ ఏకామ్రేశ్వరుడు" అను పేర పృథ్వీలింగమైనది. "ఏక" అనగా "ఒకటి". "ఆమ్ర" అనగా "మామిడి వృక్షము". మామిడి చెట్టు నీడన యున్న మహాదేవుడు కనుక ఏకామ్రేశ్వరుడైనాడు. అంతేగాక మామిడి చెట్టు జ్ఞానమునకు ప్రతీక. ఈ చరాచర జగత్తు నందు తానే ఒక్కడై నిలిచి యున్నాడన్న జ్ఞానమును కలిగించు స్వామి గనుక ఏకామ్రేశ్వరుడైనాడు.

శ్రీ ఏకామ్రేశ్వరుని ఆలయము కాంచీనగరమునకు వాయువ్య భాగమున యున్నది. కాంచీనగరము నందు అతి పెద్ద దేవాలయము ఇదే. కామాక్షి అమ్మవారి ఆలయమునకు సుమారు 1 కి. మీ. దూరములో, కంచి కామకోటి పీఠమునకు అతి దగ్గరలో ఉంది. జనులందరూ సామాన్యముగా దక్షిణ రాజగోపురము నుండి ఆలయ ప్రవేశము చేస్తారు. ఇది కాంచీనగరము నందు

యున్న అత్యంత ఎత్తైన గోపురము. గొపురమునకు ఇరువైపులా గణపతి, సుబ్రహ్మణ్యులు దర్శనమిస్తారు. గోపురము దాటి ఆలయ పరిసర ప్రవేశము చేసినప్పుడు ఎదురుగా నందీశ్వరుడు, వెనుక శివగంగ తీర్థము దర్శనమిస్థాయి. అంతర్వాహిని గా ప్రవహించుచున్న కంపానదియే ఈ తీర్థముగా ఏర్పడిందని పెద్దల మాట. ఈ తీర్థపు గట్టు మీద కాంచీనగరపు స్థల గణపతి అయిన "శ్రీ వికటచక్ర గణపతి" గూడా దర్శనమిస్తారు. నందీశ్వరునికి ఎదురుగా ఉన్న ఆలయ ముఖద్వారము గుండా లోపలికి ప్రవేశము చేసినప్పుడు దేవాలయపు రెండవ ప్రకారమునకు చేరుకుంటాము. ముఖద్వారానికి ఎదురుగుండానే మొదటి ప్రాకారమునకు మరియు స్వామి సన్నిధికి చేర్చు ద్వారం ఉంది. రెండవ ప్రాకారము నందు ప్రవేశించేటప్పుడు ఎడమ ప్రక్కగా ఒక గాజు పెట్టె లో 3,500 సంవత్సరముల వయసు కలిగిన మామిడి వృక్షము ఒక్క కాండము దర్శనమిస్తుంది. మనకు ప్రస్తుతము కనిపించే వృక్షము దేవాలయ అధికారులచే కొన్ని సంవత్సరములకు పూర్వము నాటబడింది.

రెండవ ప్రాకారము నందు ప్రవేశించిన తరువాత ఎడమ ప్రక్కగా ప్రదక్షిణ మార్గమునందు ముందుకు సాగితే మొదట కుడి ప్రక్కన శ్రీ దుర్గాదేవి దర్శనమిస్తారు. తరువాత ప్రాకారము నందు ఎందరో మహానుభావులు ప్రతిష్ట చేసిన ఎన్నో శివలింగములు దర్శనమిస్తాయి. అవి దాటి ముందుకు సాగగా ఆలయ వెనుక భాగమున "స్థల వృక్షము" అయిన మామిడి వృక్షము కనిపిస్తుంది.

ఒకానొక ప్రళయ కాలమున "మృకండునందనుడు" అను మహానుభావుని రక్షింప శంకరుడు బీజాకారము పొంది ఆ బీజము నుండి నాలుగు వేదములు శాఖలుగా విరాజిల్లు ఒక మామిడి వృక్షమును సృష్టించిరి. నెమలివాహనుడగు కుమారస్వామి ఆ వృక్షపు మూలమునకు చేరిరి. ప్రళయ జలముల నందు కొట్టుకుపోతున్న మృకండునందనుడు ఆ వృక్షమును మరియు కుమారస్వామిని దర్శనము చేసి ఆ స్వామిని ప్రార్థించగా స్వామి మృకండునందనునితో ఆ వృక్షము ఉన్న స్థలము ప్రళయకాలము నందు కూడా వినాశనం గాక భయరహితమై ఉండు కాంచీనగరము అని తెలిపి మృకండునందనుని రక్షించిరి. నాటి నుంచి కాంచీనగరము "ప్రళయజిత్తు" అన్న పేరు కూడా వచ్చింది.

"శివబీజ సముద్భూతం, వేదశఖాభిరుజ్జ్వలమ్
మృకండు తనయాధారం రసాలం తం నమామ్యహం"

సాక్షాత్తు శివస్వరూపమైనట్టి ఆ వృక్షము యొక్క నాలుగు శాఖల నుండి ఉద్భవించు మామిడిపళ్ళు నాలుగు వేరు వేరు రుచులు కలిగి యుండటం ఇక్కడి విశేషం. ఈ వృక్షము నుండి కింద పడిన ఫలము ఆరగిస్తే సంతాన లేని వారికి సంతానము కలుగుతుందని పెద్దల మాట.

మామిడి వృక్ష సందర్శనానంతరం మరల ప్రదక్షిణ మార్గము నందు ముందుకు వెళ్ళగా సహస్రలింగము, "శ్రీ నటరాజ స్వామి" మందిరము, నవగ్రహ మండపము దర్శనం చెయ్యచ్చు. రెండవ ప్రాకారము నందు ప్రదక్షిణ పూర్తి చేసి

లోపలి మొదటి ప్రాకారములోకి ప్రవేశించి మళ్లీ ప్రదక్షిణ మార్గములో సాగగా వరుసగా అరువది ముగ్గురు నాయనార్లు, గణపతి మరియు వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యుడు దర్శనమిస్తారు. ప్రదక్షిణ పూర్తి చేయుటకు ముందు "శ్రీ చంద్రగ్రీవుడు" అను పేర "శ్రీమన్నారాయణుడు" దర్శనమిస్తారు. ఈ స్వామి తపోసమయమున అమ్మవారికి తరుణోపాయము చెప్పిన కారణమున శంకరుని కోరికతో ఇచ్చట వెలిసి ఉన్నారు. రెండు మూర్తులను ఇక్కడ దర్శనము చేయవచ్చు. ప్రదక్షిణ పూర్తి చేసి లోపలికి చేరితే గర్భాలయమున "శ్రీ ఏకామ్రనాధుని" దివ్య సైకత లింగము దర్శనమిస్తుంది. సైకతలింగము కనుక ఈ లింగమునకు అభిషేకము లేదు. కేవలము పానవట్టమునకు పునుగు తైలంతో అలంకరణ చేస్తారు.

ఫాల్గుణ మాసమున ఉత్తర ఫల్గుణి నక్షత్ర యుక్త దినమున "శ్రీ పరిమళకుంతలాంబ" అన్న పేరుతో జగజ్జననికి, శ్రీ ఏకామ్రనాధునికి కళ్యాణము జరుపుతారు. ఈ కళ్యాణ సమయమున ఆది దంపతులతో బాటు వివాహము చేసికొనుటకు వధూవరులు ఆలయ ప్రాంగణము నకు వచ్చి స్వామి వారి కళ్యాణము జరుగు సమయమున వారు కూడా కళ్యాణము చేకుంటారు.

ఎన్నో యుగములుగా శిష్ట పరిపాలన చేస్తూ, ఎందరో మహానుభావులకు జ్ఞానమార్గమును చూపి, వారిని ఉద్ధరించి, "శివా" అని పిలిచినంత మాత్రమున భక్తుల కష్టములు నివారిస్తూ, సమస్త జగత్తుకు తండ్రియై నిలిచి యున్న "శ్రీ ఏకామ్రనాధ స్వామి" దర్శనం ఎన్నో జన్మల పుణ్య ఫలం.